# రైల్వే గేటు!



పాలపర్తి ధనరాజ్

రైలు వస్తోందనడానికి సూచనగా గేటు పడింది. ఇంకా పడలేదు ... పడబోతోంది.

పడబోయే ఆ రెండు నిముషాల్లోనే .... "నన్ను వెళ్లనీయ్!" అని ఓ స్కూటరిస్ట్ రిక్వెస్ట్.

"బాబ్బాబు .... ఈ ఒక్క కారే!" అని ఓ కారువాలా అర్థింపు.

"ఈ బస్సొకటే...!" అని ఓ సిటీ బస్సు డ్రైవరు విజ్ఞాపన.

వీటన్నిటిమధ్యా ఆఖరికి గేట్‌మన్ గేటు మూయగలిగాడు. అతను మళ్లీ కేబిన్‌లోకి వెళ్లిపోయేలోగా ఛీత్కారాలు, తిట్లు, నిష్ఠూరాలు .... అనేకం...

గేటువడింది! వాహనాలన్నీ అటూ ఇటూ ఆగిపోయాయి.

"తాతయ్యా! ఏం చేద్దాం?" సన్నీ అడిగాడు.

"ఏం చేద్దాం, ఇలాగే ఉందాం!" అన్నాడు రఘురామయ్య.

రఘురామయ్య రిటైర్ అయిపోయిన తర్వాత, పెద్దకొడుకు దగ్గరే ఉంటున్నాడు. నిజాయితీకి మారుపేరుగా పేరొంది, తోటి ఉద్యోగస్తుల్లో ప్రత్యేకత పొందాడు. సన్నీ రఘురామయ్య మనుమడు. ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు.

"తాతయ్యా! స్కూల్‌కి టైమవుతోంది!" లూనా మీదున్న రఘురామయ్యని తడుతూ అన్నాడు.

"చూడొరే, సన్నీ! నువ్వు ఇంకా చదువుకునే కుర్రాడివి. నీకు పోయేది మహా అయితే ఒక క్లాసు. ఇక్కడ ఈ వాహనాల వాళ్లందరూ.... వాళ్లకీ ఆలస్యమైపోతుందిగా! రైలు రానీ!" అన్నాడు.

"అదికాదు, తాతయ్యా! అటు చూడండి!" అన్నాడు సన్నీ.

గేటు కిందనుంచి దూరుతున్న సైకిళ్లు, స్కూటర్లు కనిపించాయి రఘురామయ్యకు. కిందకు వంగిపోయి, వెహికిల్స్‌ని దాదాపు నేలమీదకి పడుకోబెట్టి మరీ దాటుతున్నారు కొంతమంది. అందులో ఉద్యోగస్తులు, గౌరవప్రదంగా కనిపిస్తున్నవాళ్లూకూడా ఉన్నారు. గేటుకి ఇటుదూరి దాటి, మళ్లీ నిటారుగా అయి, అప్పుడు రైలు పట్టాలకేసి చూస్తున్నారు. రైలు రావట్లేదని తెలిసి, మళ్లీ అవతలి గేటువైపు దూరి దాటుతున్నారు.

ఎటొచ్చీ కార్లు, బస్సులు వెళ్లలేకపోతున్నాయి.

గేట్‌మన్ చెప్తున్నాడు దాటవద్దని. వినేవాళ్లే కరువయ్యారు. ఎవరిమటుకు వారు గేట్‌మన్ చెప్పేది తనకి కాదు అన్నట్టు దాటి వెళ్లిపోతున్నారు.

"తాతయ్యా! మనం కూడా!" సన్నీ నసిగాడు.

రఘురామయ్య మనస్సు సన్నీ మాటల్ని పట్టించుకోవడంలేదు. రెండేళ్లక్రితం తన తోటి ఉద్యోగితో రైలు గేటు పడినప్పటి సంభాషణ గుర్తొచ్చింది ...

"ఏం రఘురామయ్య, ఏం చేద్దాం! దూరి దాటి వెళ్లిపోదామా!" కృష్ణమూర్తి అన్నాడు. కృష్ణమూర్తి రఘురామయ్య కొలీగ్.

"కృష్ణమూర్తీ! నా కెందుకో అలా దాటడం మంచిది కాదు అనిపిస్తుందయ్యా! ఎందుకంటే అదేదో అలా దాటుతుంటే అడ్డదారి తొక్కుతున్నట్టు ఉంటుంది. అసలా గేటు ఎవరికోసం వేశారంటావ్, ఎందుకు వేశారంటావ్!" అడిగాడు కృష్ణమూర్తిని.

"నీ చాదస్తం గూలా! గేటు ఎందుకు వెయ్యడం ఏంటయ్యా, రైలొస్తుందని!" అన్నాడు.

"అవును కదా! మరి రైలు రాకుండానే అడ్డదిడ్డంగా అనధికారికంగా అలా వెళ్లడం మంచిదంటావా!"

"బాగానే ఉంది నీ ఆర్గ్యుమెంట్! మరి మన టైం?"

"నీ ఆర్గ్యుమెంట్ ఇంకా బాగుంది. అందరికీ అన్నీ బిజీ పనులే కదా ఉంటాయి. మరి గేటు వెయ్యకూడదుగా!"

"హుఁ! నీతో వాదించలేం గానీ, రైలు వచ్చేదాకా ఆగుదాం బాబూ!" అన్నాడు కృష్ణమూర్తి ఓటమిని అంగీకరిస్తూ.

"అదికాదు, కృష్ణమూర్తీ! అసలే రైలు గేటు పడినప్పుడల్లా నాకు ఈ సమాజం ... దేశం ... గుర్తొస్తాయి. అందరం ప్రభుత్వాన్ని, చట్టాల్ని పట్టించుకోకుండా మన స్వార్థంకొద్దీ ప్రయాణం చేస్తున్నామేమో! ప్రభుత్వపరంగా అధికారయుతంగా పనులు చేయించుకోడానికి బదులు, చాలామంది అడ్డదార్లు తొక్కుతూ పనులు జరిపించేసుకుంటున్నారు. అదిగో అలానే ఆ సైకిళ్లూ, స్కూటర్లూ చూడు ...." అంటున్నాడు రఘురామయ్య. కృష్ణమూర్తి నిస్తేజంగా ఉండిపోయాడు.

"తాతయ్యా! నిన్నే ... మనం కూడా కిందనించి దూరి వెళ్లిపోదామా?"

ఏమనాలో తోచలేదు రఘురామయ్యకి. సన్నీ ఈ కాలం కుర్రాడు. ఈ కాలంతోనే ఎదగాల్సినవాడు.

"సన్నీ! రైలొచ్చేదాకా ఉండి, అప్పుడు దాటుదాం. అంతే!" స్థిరంగా అన్నాడు రఘురామయ్య.

దూరంగా రైలొస్తున్నట్టు కూత వినిపించింది.